క్లుప్తంగా

సంజామలలో తాగునీటి సమస్య



నీటి సమస్యపై చర్చిస్తున్న గోపీనాథ్

సంజామల: మండల కేంద్రం సంజామలలోని సాలేపేట, ముస్లిం వీధి,కమలమ్మబాయి వీధి తదితర కాలనీలలో పదిరోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. దీంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆయా కాలనీల ప్రజలు సచివాలయ ఉద్యోగులకు మొరపెట్టుకున్నారు. పదిరోజులుగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి గోపీనాథ్ నీటి సమస్య పునరావృత్తం కాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యూసుఫ్ ఉస్సేన్, మక్బుల్ ఉస్సేన్, షాకిర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని, లేకపోతే ఉపాధ్యాయుల ఉనికికే ప్రమాదమని యూటీఎఫ్ రాష్ట్ర సభ్యులు వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మండలంలో మంగళవారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 117 జీవోను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, మండల అధ్యక్షుడు మద్దిలేటి రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ కాంత నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కోవెలకుంట్ల: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జేఏసీ నాయకులు అందనం దేవరాజు, దాసు కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, ఇళ్లులేనివారికి పక్కాగృహాలు మంజూరు చేయాలని, బ్యాంకు రుణాలు, మూడుచక్రాల వాహనాలు పంపిణీ చేయాలన్నారు. దివ్యాంగుల సమస్యలకు పరిష్కారం చూపాలని జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరీని కలిసి విన్నవించినట్లు పేర్కొన్నారు.

మహిళ మృతి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని మర్రికుంట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రామేశ్వర్‌రెడ్డి భార్య మహేశ్వరి అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ డైరక్టర్ బాబుల్ రెడ్డి, నాయకులు బుగ్గన కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, బళ్లాని సూర్య తదితరులు మహేశ్వరీ మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్లలోని రేణుకా మాతా, నందిఫర్టిలైజర్స్, కొరమండల్ దుకాణాలను మంగళవారం డీడీఏ సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ శాఖ సీఐ సునీల్ కుమార్ తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుల మందుల రికార్డులను పరిశీలించారు. స్టాక్, బిల్ బుక్స్, ఇన్వాయిస్ తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో 10 లక్షల విలువగల ఎరువుల అమ్మకాల రికార్డులు అప్‌డేట్‌కాలేదని నిలుపుదల చేసినట్లు ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చంద్రబాబు నాయుడి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తూ జీఓ నంబరు 43 విడుదల చేయడంతో మంగళవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంత్రి స్థానిక స్వగృహ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో అమలైన పాలసీ మూలంగా భవన కార్మికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దిన్, టీడీపీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘చిరు’సాగు... లాభసాటి!

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- గిట్టుబాటు ధర లభిస్తున్న వైనం
- పెరుగుతున్న చిరుధాన్యాల వినియోగం



ఏపుగా పెరిగిన రాగి పైరు

బనగానపల్లె: చిరుధ్యాన్యాల సాగు లాభసాటిగా మారింది. ప్రస్తుత ఆరోగ్య సమస్యల నేపథ్యంలో ప్రజలు సైతం చిరుధాన్యాలను వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతులు సైతం వీటి సాగుకు మొగ్గు చూపుతున్నారు. స్పీడ్ యుగంలో మనిషి జీవితం సైతం ఉరుకులు, పరుగులు అన్నట్లుగా మారింది. ఆహార అలవాట్లు పూర్తిగా మారిపోయాయి. ప్రత్యేకించి జంక్‌ఫుడ్ తినడానికి జనం అలవాటుపడిపోయారు. దీంతో అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యుల సూచనల మేరకు చాలా వరకు చిరుధాన్యాల ఆహారం తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రత్యేకించి షుగర్ వ్యాధిగ్రస్తులు కొర్ర, జొన్న, రాగుల ఆహారం తీసుకుంటున్నారు. అదేవిధంగా వీటి సాగును ప్రభుత్వం ప్రోత్సాహిస్తూ మద్దతు ధరను కూడ ప్రకటించింది. హైబ్రిడ్ జొన్న క్వింటాం రూ.3,180కాగా సాధారణ జొన్నలకు రూ.3,225, రాగులకు క్వింటాం రూ.3,846 చొప్పున ప్రభుత్వం ప్రకటించింది. లాభసాటిగా ఉండడంతో ఈ పంటలు తక్కువ వర్షపాతం ప్రాంతాల్లో పండిస్తున్నారు రైతులు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో సుమారు 8 వేల హెక్టార్లలో ఈ పంటల సాగు ఉండగా బనగానపల్లె నియోజవర్గంలో సుమారు 600 హెక్టార్లలో చిరుధాన్యాలు సాగు ఉంటుందని వ్యవసాయ అధికారుల సమాచారం.

అధిక దిగుబడులే లక్ష్యంగా...

నేటి పోటీ ప్రపంచంలో అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన వినియోగంలో రైతులు పోటీ పడుతున్నారు. ఫలితంగా భూమిలో రసాయన అవాశేషాలు నిండి దిగుబడులు తగ్గిపోతున్నాయి. దీంతో ఖర్చులు పెరిగి నష్టాలు చవిచూస్తున్నారు. ధాన్యాల్లోనూ రసాయన ఆవశేషాలు ఎక్కువ ఉన్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. దీంతో చాలామంది ఇప్పుడు చిరుధాన్యాలు కొర్ర, వరిగ, సామలు, ఆరికలు, ఊదలు, రాగి, సజ్జ, జొన్నలు వినియోగిస్తున్నారు. రైతులు ఇప్పుడిప్పుడే వీటి సాగుకు మొగ్గు చూపుతున్నారు. చిరుధాన్యాలు ఒకప్పుడు పేదలు, మధ్య తరగతి ప్రజల ప్రధాన ఆహారం. నాలుగు దశాబ్దల క్రితం వరకు వీటి వినియోగం అధికంగా ఉండేది. ఈ ధాన్యాలను పసువుల ఎరువు, చెరువుమట్టి సేంద్రియ ఎరువులతో పంటలు పండించేవారు. అనంతరం వచ్చిన మార్పుల నేపథ్యంలో చిరుధాన్యాల సాగు తగ్గుతూ వచ్చింది. రైతులు వాణిజ్యపంటల సాగుపై ఆసక్తి చూపుతుండడంతో వీటి అంతంత మాత్రంగా మారింది.

> **చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి**
>
> 
>
> ప్రస్తుతం చిరుధాన్యాల సాగు లాభసాటిగా ఉంది. వీటి సాగుపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కొర్ర, జొన్న, రాగుల వినియోగం పెరిగినందున రైతులు లాభాలు గడించే అవకాశం ఉంది. పెట్టుబడి ఖర్చు పూర్తిగా తగ్గుతుంది. భూసారం తగ్గకుండా కాపాడుకోవచ్చు. ఈ మేరకు తమవంతుగా చిరుధాన్యాల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తున్నారు.
>
> – సుధాకర్ వ్యవసాయశాస్త్రవేత్త కేవీకే, యాగంటిపల్లె గ్రామం బనగానపల్లె మండలం

పాలీసెట్ చివరిదశ వెబ్ కౌన్సెలింగ్

బేతంచెర్ల: పాలీసెట్ 2024 ప్రవేశ పరీక్షలో అర్హత పొంది, మొదటి దశలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు వెళ్లని విద్యార్థినీ, విద్యార్థులు చివరి దశ వెబ్ కౌన్సెలింగ్‌కు దగ్గరలోని హెల్ప్‌లైన్ కేంద్రాలలో సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించడాని 11వ తేదీ నుంచి 13వరకు, సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు 11వ తేదీ నుంచి 13 వరకు, వెబ్ ఆప్షన్స్ ఎంట్రీకి 11నుంచి 14వ తేదీ వరకు సీట్ల అలాట్‌మెంట్ 16వ తేదీ ఉంటుందన్నారు. కళాశాలల రిపోర్టు చేయుటకు 18వ తేది నుంచి 20 వరకు ఉంటుందన్నారు. బేతంచెర్ల పాలిటెక్నిక్ కళాశాల వెబ్ కౌన్సెలింగ్ కోడ్ bmc అని తెలిపారు. పూర్తి వివరాలకు 7075872668 సంప్రదించాలని సూచించారు.

నేడు వారపు సంత నిర్వహణకు వేలం పాట

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంత నిర్వహణకు సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో బుధవారం పది గంటలకు లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి భాస్కర్‌రావు తెలిపారు. వేలం పాటపై గ్రామంలో డప్పు వేయించామన్నారు. గడువు ముగియడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహిస్తున్నామని ఆసక్తి వ్యక్తులు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు.

బాధ్యతగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు

బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు కోరారు. మంగళవారం పట్టణంలోని ధరణి టౌన్ షిప్పులో కమిషనర్ ధర్మలేషియా మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాలు, ఇంటి ఆవరణాలలో మొక్కలు నాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మధు సూధన్ రెడ్డి, మధు, నగర పంచాయతీ సిబ్బంది రమణ పాల్గొన్నారు.

- గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీ చైతన్య విద్యార్థులు డోన్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కవిత పిలుపునిచ్చారు.

భవనాలు నిర్మించాం...వసతులు కల్పించండి

- రూ. 40 కోట్లతో వంద పడకల ప్రభుత్వాసుపత్రి
- రూ.30కోట్లతో పూలే బాలికల వసతి గృహం
- మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత పాలకులదే
- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశమైన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. కోట్లు వెచ్చించి సుందరంగా ప్రభుత్వ భవనాలు నిర్మించామని, ప్రస్తుత పాలకులు పూర్తిస్తాయిలో మౌలిక వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.40 కోట్లతో అత్యంత ఆధునిక వసతులతో వంద పడకల ప్రభుత్వాసుపత్రి, రూ.30కోట్లతో మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల వసతిగృహం నిర్మించామని, వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకుల దేనని స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం 6 గంటలకు బుగ్గన వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేశారు. వాకర్స్‌తో కొద్దిసేపు ఆయన ముచ్చటించారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో పార్టీ శ్రేణులతో సమావేమయ్యారు. నాయకులతో ప్రజాసమస్యలపై చర్చించారు. ఆయా కార్యక్రమంలో మాజీ మంత్రి బుగ్గన మాట్లాడారు. వంద పడకల ప్రభుత్వాసుపత్రి, మహాత్మ జ్యోతిరావుపూలే బాలికల వసతిగృహం నిర్మాణంతోపాటు సిబ్బంది, మంచినీరు, విద్యుత్ లాంటి సౌకర్యాలు గత ప్రభుత్వం కల్పించిందని, ఫర్నీచర్, ఫ్యాన్లు, ఎంఆర్ఐ, ఎక్స్‌రే లాంటి మిషన్లను ఆసుపత్రి భవనంలో ఏర్పాటు చేసేందుకు అధికార పార్టీ నాయకులు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా రూ.3 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ రిజిస్ట్రార్ కార్యాలయం, యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కొత్త కోట వద్ద నిర్మించిన ఐటీడీఆర్ కార్యాలయాన్ని వెంటనే పూర్తిచేయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. యువత ఉపాధి కోసం గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఉపాధి శిక్షణ కేంద్రాలు, కుట్టు శిక్షణ కేంద్రాలతో పాటు కియా నాలెడ్జ్ సెంటర్లను సద్వినియోగం చేసుకొని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేసిన విషయాన్ని గుర్తుచేసిన మాజీ మంత్రి బుగ్గన... ప్రస్తుత పాలకులు పేదల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న పాలకులు

టీడీపీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, ఇలాంటి చర్యలు మానుకోవాలని మాజీ మంత్రి బుగ్గన సూచించారు. గత ప్రభుత్వంలో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా నిష్పక్షపాతంగా పోలీసులు వ్యవహరించేలా సహకారం అందించాలమని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలందించామని, అదేతీరులో ప్రజా తీర్పును గౌరవిస్తున్నామన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ పెద్దలు స్వార్థప్రయోజనాలకే ప్రాముఖ్యతనిస్తున్నారన్నారు. వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని, ఇలాంటి పోకడ ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా మారేప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు దొరపల్లె చిరంజీవి, కురుకుందు హరి, ఎస్‌కేడీ యూనివర్సిటీ పాలకవర్గ సభ్యులు నాగభూషణంరెడ్డి, బలిజ సంఘం నాయకులు పటేల్, పార్టీ కార్యాలయం ఇన్‌చార్జ్ ఎద్దుల రాజేంద్రనాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున రెడ్డి, జనార్దన్, మహేశ్వరరెడ్డి, కటిక వేణు, నాయకులు సోమేష్ యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, పోస్టుప సాద్, బొబ్బల శివరామిరెడ్డి, రంగారెడ్డి, మల్యాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మార్నింగ్ వాక్ చేస్తున్న మాజీ మంత్రి బుగ్గన

బలవంతపు రాజీనామాలు ఆపాలి



సీడీపీఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వ నాయకులు అంగన్‌వాడీలను బలవంతంగా రాజీనామాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, వీటిని వెంటనే ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేబారాణిలు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రాల్లో చేపట్టనున్న ధర్నాలో అంగన్‌వాడీలు పాల్గొనేందుకు అనుమతులు కోరుతూ మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ శంషాద్‌బేగంను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో డోన్ మండల అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సులోచన, సుమలత, రహమత్‌బీ, మంజుల, ఈశ్వరమ్మ, నాగలక్ష్మీ, గుల్జార్‌బీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన రాచరికం సినిమా షూటింగ్



హీరోయిన్ అప్సర్ రాణిని ద్విచక్రవాహనంపై తీసుకెళ్తున్న హీరో విజయ శంకర్

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమకింది కొట్టాల గ్రామంలో రెండవ రోజు మంగళవారం రాచరికం సినిమా షూటింగ్ కొనసాగింది. హీరో విజయ శంకర్, హీరోయిన్ అప్సర రాణి గ్రామంలో బైక్‌పై వెళ్తున్న దృశ్యాలు, బిల్ల స్వర్గం గుహల వద్ద సాంగ్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఫ్యాక్షన్, పొలిటికల్ నేపథ్యంలో కూడిన సినిమా అని డైరక్టర్ సురేష్, ప్రొడ్యుసర్ ఈశ్వర్ తెలిపారు. యువతులు, యువకులు హీరో, హీరోయిన్‌తో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. గత వైఎస్సార్ ప్రభుత్వ హయంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో కనుమ కింది కొట్టాల గ్రామ సమీపాన బిల్ల స్వర్గం గుహలను ఏపీ టూరిజం కింద రూ. 2 కోట్లతో అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మొదటి సారి రాచరికం సినిమా షూటింగ్ జరిగింది.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ప్యాపిలి: గర్భిణులు ఆరోగ్యపరంగా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారిణి వాణిశ్రీ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ ప్రతి నెలా పీహెచ్‌సీలో నిర్వహించే వైద్య పరీక్షలకు గర్భిణులు తప్పక హాజరు కావాలన్నారు. బిడ్డ ఎదుగుదల బాగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. వైద్యులు ఇచ్చిన మందులు తప్పనిసరిగా వాడాలని సూచించారు.

గర్భిణులకు స్టాఫ్‌నర్స్ అన్నదానం

పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన వైద్య పరీక్షలకు సుదూర ప్రాంతాల నుంచి గర్భిణులు వ్యయప్రయాసలతో వచ్చారు. పరీక్షల అనంతరం తిరిగి వారు తమ గ్రామానికి చేరుకోవాలంటే సాయంత్రం అవుతుంది. పరిస్థితిని గమనించిన స్టాఫ్‌నర్స్ మల్లికార్జున తన స్వంత ఖర్చుతో 65 మంది గర్భిణులకు భోజనం ఏర్పాటు చేశారు.

13న ఉచిత వైద్య శిబిరం

డోన్ టౌన్ : పట్టణంలోని వైద్య పాలీక్లినిక్ కేంద్రంలో ఈ నెల 13న కర్నూలుకు చెందిన రియా ఫెర్టిలిటీ టెస్ట్ ట్యూబ్ బేబి సెంటర్ డాక్టర్ శ్రావ్య ఆధ్వర్యంలో శనివారం గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయనున్నట్లు మంగళవారం ఆసుపత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు.అలాగే సంతానం కలగని వారికి పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలతో పాటు కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

యువకుడిపై దాడి

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న గుమ్మకొండ దాబా హోటల్ వద్ద మంగళవారం తారకరామనగర్‌కు చెందిన ఎరుకల సుంకన్న కుమారుడు నాగార్జునపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడారు. వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌గౌడ్ వెంట ఉన్న వ్యక్తులు తనపై దాడిచేసి గాయపరిచారని బాధితుడు నాగార్జున పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హిట్ అండ్ రన్ కేసు నమోదు

డోన్ టౌన్ : పట్టణంలోని సుందర్‌సింగ్ కాలనీలో మంగళవారం ఆడుకుంటున్న నేసే రమణయ్య కూతురు వైష్ణవిని గుర్తు తెలియని యువకుడు బైక్‌తో ఢీకొట్టి పారిపోయాడు. నేసే రమణయ్య ఫిర్యాదు మేరకు తండ్రి ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తిపై హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

శింగనపల్లెలో పొలంబడి



శింగనపల్లెలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ అబ్దుల్ హక్

అవుకు: మండల పరిధిలోని శింగనపల్లెలో ఏఓ అబ్దుల్ హక్ మంగళవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రైతులతో గ్రామ సభ నిర్వహించి వరి సాగులో సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గ్రామంలోని రైతుల పొలాల్లోకి వెళ్లి విత్తన శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నారుమడికి మొదట సూడోమోనస్ శిలీంద్రనాశినితో విత్తన శుద్ధి చేయాలన్నారు. నారు యాజమాన్యంలో సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫురాన్ 3జీ గుళికలను వేయాలని, దీని వలన వరిలో కాండం తొలిచే పురుగును అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ బాషా, రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించాలి



మాట్లాడుతున్న ఏడీఏ రాజశేఖర్

బనగానపల్లె రూరల్ : మండలంలో కౌలు రైతులను గుర్తించాలని ఏడీఏ రాజశేఖర్, ఏఓ సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో వ్యవసాయ సహాయకులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామస్థాయిలో విధులు నిర్వహించే వ్యవసాయ సహాయకులు అర్హత ఉన్న కౌలు రైతులను గుర్తించి కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసి వారికి బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షభావ పరిస్థితులు నెలకొనడం జరిగిందని, క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన మేరకు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. ఉద్యానవశాఖ అధికారి రఘువరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం పామ్ అయిల్‌తోటల సాగును ప్రోత్సహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తుమ్మల అగ్రోస్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ తుమ్మల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి



ర్యాలీలో పాల్గొన్న ఐసీడీఎస్ ఉద్యోగులు

డోన్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఐసీడీఎస్ అధికారిణి షంషాద్‌బేగం సూచించారు. ఈ మేరకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా మంగళవారం సాగిన అంగన్‌వాడీ కార్యకర్తల సంకల్ప ర్యాలీలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు చెందిన సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 21 నుండి అక్టోబర్ 4వ తేదీ వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని ప్రజల వద్దకు వెళ్లి నూతన చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల రద్దు, లైంగిక వేధింపులు, లింగ వివక్ష, బాలల హక్కులు, పోక్సో చట్టం, పరిశుభ్రత, పౌష్టికాహారం, బాలల అక్రమ రవాణా లాంటి వాటిపై సంపూర్ణంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పరమేశ్వరి, శోభ, పద్మ, అరుణ, దేవకృప, సుగుణ, శకుంతల, తిమ్మమ్మ, ఈశ్వరమ్మ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్ : ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆర్‌టీఓ క్రాంతికుమార్ సూచించారు. స్థానిక ఆర్‌టీఓ కార్యాలయంలో మంగళవారం వాహనచోదకులకు రోడ్డు నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడుతామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు కట్టడి చేయొచ్చన్నారు. అలాగే లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

డోన్ రూరల్: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాల్లో దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా డీడీఏ సుబ్రమణ్యం, కృష్ణా జిల్లా ఏడీఏ శ్రీనివాస్‌లు హెచ్చరించారు. రాష్ట్ర కమిషన్ కార్యాలయం నుంచి మంగళవారం విత్తనాలు, ఎరువులు, పరుగుల మందుల డీలర్‌ల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు డోన్ పట్టణంలోని దుకాణాలను తనిఖీ చేశారు. అలాగే మండలంలోని ఉడుములపాడు గ్రామం వద్ద ఉన్న పరుగులమందు తయారీ కేంద్రం అగ్రిసోల్ ను తనిఖీ చేశారు. కొన్ని మందుల నమూనాలను శాంపుల్స్‌గా తీసి ల్యాబ్‌కు పంపించారు. వారి వెంట జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఏడీఏ పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌షఫి, కిరణ్‌కుమార్, విజిలెన్స్ అధికారులు సునీల్, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



మురుగు కాల్వలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

డోన్ : అతివేగంగా విస్తరిస్తున్న అంటువ్యాధుల నియంత్రణకు మున్సిపల్ అధికారులు, పాలకవర్గం అన్ని చర్యలు తీసుకుంటుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. మంగళవారం 14వ వార్డులో డీఈ రసూల్, ఏఈ సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషాలతో కలిసి ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క ఇంటి యజమాని తమ ఇంటి వద్ద నీటి నిల్వలు ఎక్కువ రోజులు ఉంచుకోరాదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకునేలా శ్రద్ధ వహించాలన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ఆయిల్‌పామ్ మొక్కల సాగుపై అవగాహన

డోన్ రూరల్ : మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామంలో మంగళవారం నవభారత్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ మొక్కల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజగోపాల్, డిప్యూటీ మేనేజర్ ఫిరోజ్ మాట్లాడుతూ అయిల్‌పామ్ మొక్కల ఖరీదుపై వంద శాతం రాయితీ ఉంటుందన్నారు. సాగు ప్రోత్సహంలో భాగంగా హెక్టార్‌కు 50శాతం రాయితీ 4సంవత్సరాలుగాను రూ.21వేలుకు మించకుండా ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతర్ పంట సాగుకు 50శాతం రాయితీ ఉంటుందన్నారు. అలాగే రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చేందుకు రోజుకు ఒక్కొక్కరికి రూ.500 ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ ఉదయ్‌కుమార్‌నాయుడు, వీహెచ్‌ఏ స్వప్న, రైతులు పాల్గొన్నారు.